

# కోరిక

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఆ ఆట గురించి తెలిసిన మిస్టర్ అండ్ మిసెస్ పశుపతినాథ్ ముందర ఆశ్చర్యపోయారు. తర్వాత ఆలోచించారు. ఆ తర్వాత ఆకర్షితులయ్యారు.

"ఇది సింపిల్ గేమ్. మన స్కూటర్ తాళం చెవులన్నీ ఓ డబ్బాలో పోసి బాగా కదుపుతాం. ప్రతి ఆటగాడు తన చేతికి వచ్చిన తాళం చెవి తీసుకుంటాడు. ఎవరి స్కూటర్ తాళం చెవి వస్తే ఆ స్కూటర్ యజమాని భార్య ఆ రోజంతా అతనితో గడపాలి. ఇలా పన్నెండు మంది స్కూటరిస్టుల భార్యలు, తమ భర్తతో కాక ఇంకొకరితో గడపాల్సి వుంటుంది. 'వైఫ్ స్వాపింగ్' అంటారు దీన్ని." పశుపతినాథ్‌కి చెప్పాడు అతని మిత్రుడు యతిరాజ్.

"నువ్వు అందులో పాల్గొన్నావా?" అడిగాడు కొత్తగా ఢిల్లీ బదిలీ అయి వచ్చిన పశుపతినాథ్.

"చాలాసార్లు. తమాషాగా వుంటుంది. ఎక్సైటింగ్‌గా కూడా వుంటుందా ఆట. ఎవరికి ఎవరు దొరుకుతారో అన్న ఉత్కంఠ అనుభవించి తీరాలి. అయితే ఈ ఆటలో ముఖ్యమైన నియమం-వాళ్ళ మధ్య ఏం జరిగిందో ఇతరులకి చెప్పకూడదు. ఆఖరికి ఆమె తన భర్తకి, అతను తన భార్యకి అయినా సరే చెప్పకూడదు. మరోసారి రహస్యంగా వాళ్ళిద్దరూ కలుసుకోకూడదు. ఇట్స్ ఫర్ ఫన్. ఆలోచించండి."

"నువ్వు ఒప్పుకోవేమోనని భయపడ్డాను. ఐయాం రెడీ" ఉత్సాహంగా చెప్పాడు పశుపతినాథ్.

యతిరాజ్ ఇంటికి ఫోన్ చేశాడు అతను. ఆ రాత్రి తామిద్దరూ కూడా ఆ ఆటలో పాల్గొనడానికి వస్తున్నామని చెప్పాడు. సరిగ్గా రాత్రి ఏడున్నరకి ఇద్దరూ తమ స్కూటర్ మీద యతిరాజ్ ఇంటికి వెళ్ళారు. అక్కడికి వచ్చినవాళ్ళంతా ముప్పై అయిదేళ్ళ లోపువాళ్ళే. అందరి భార్యలు ఇంగ్లీష్ మాట్లాడగలరు. అంతా మిసెస్ పశుపతినాథ్ భార్య వంక ఆసక్తిగా చూశారు. అందరితోపాటు తన స్కూటర్ తాళం చెవి కూడా ఓ డబ్బాలో వేశాడు పశుపతినాథ్. డబ్బా బాగా కలిపాక చెప్పాడు యతిరాజ్-

"మొదటిసారి కాబట్టి మొదటి అవకాశం నీది."

పశుపతినాథ్ ఆ డబ్బాలోంచి ఓ తాళం చెవి బయటకి తీశాడు. అది యతిరాజ్‌దే.

ఒప్పందం ప్రకారం యతిరాజ్ భార్యని తీసుకుని పశుపతినాథ్ తన ఇంటికి బయలుదేరాడు. దారిలో అతని మనసు నిండా రకరకాల ఊహలు, కోరికలు. 'వాటిల్లో కొన్నయినా తీరితే'- ఆ ఊహకే అతనికి పులకరింతగా వుంది. తన భార్య దర్పన్‌సింగ్‌తో అతనింటికి వెళ్ళింది, అక్కడేమవుతుందో అన్న ఆలోచనే రాలేదు పశుపతినాథ్‌కి.

ముందు ఆ విషయం గురించి మాట్లాడటానికే భయపడ్డాడు పశుపతినాథ్. కాని లండన్‌లో రెండేళ్ళుండి బట్టలకి రంగు వేసే కోర్స్ చదివి వచ్చిన మిసెస్ పశుపతినాథ్ అడిగింది ఓ శనివారం రాత్రి తన భర్తని-

"ఈ రాత్రి మళ్ళీ ఆ గేమ్ ఆడుతారనుకుంటాను!"

"అవును. ప్రతి శనివారం రాత్రీ అని చెప్పాడు యతిరాజ్." "ఏం?"

"మనమూ ఓసారి పాల్గొంటే ఎలా వుంటుందా అని ఆలోచిస్తున్నాను."

ఇంటికి చేరుకున్నాక తలుపు తాళం తీసి లోపలికి వెళ్ళి చెప్పాడు మిసెస్ యతిరాజ్‌తో గౌరవంగా-

"రండి"

ఆమె లోపలికి వచ్చి, అతనికి ఆనుకుని నిలబడి చిన్నగా నవ్వింది. ఆమె ఒంటి నుంచి టెరోజ్ వాసన వస్తోంది.

"మన ఒప్పందం ప్రకారం నేనేం అడిగినా మీరు చెయ్యాలి. అవునా?"

అడిగాడు పశుపతినాథ్ చొక్కా గుండీలు చకచక విప్పుతూ.

మిసెస్ యతిరాజ్ కొద్దిగా సిగ్గుపడింది అతను చొక్కా విప్పడం చూసి.

"అవును. తీరని మీ కోరికలు తీర్చడానికే వచ్చాను" చెప్పింది.

"అయితే ఈ చొక్కాకి లూజ్‌గా వున్న బటన్స్ కుట్టండి. మా ఇల్లు కూడా మీ ఇల్లంత నీట్‌గా సర్దండి. నాకు ఇష్టమయిన కందిపచ్చడి, బీన్స్ పొరోటి, వంకాయ కాల్చి పచ్చడి చేయండి. ఇంకో గంటలో వస్తారు - మా పిల్లల చేత హోంవర్క్ చేయించండి. ఇంటికి బూజులు దులిపి, పిల్లలు క్రేయాన్స్‌తో గోడలమీద రాసిన బొమ్మలు చెరిపేయండి. మీ ఇంట్లోలాగా ఇంటి వెనక మా మొక్కలన్నిటికి పాదులు చేయండి. మీ ఇంట్లో వున్నలాంటి ప్లాస్టిక్ వైరుతో అల్లిన పూలబుట్ట ఒకటి అల్లి పెట్టండి. ఇవన్నీ అయ్యాక కూడా మీకు నిద్ర రాక పోతే నాకు ఓ మిల్స్ అండ్ బూన్ నవల చదివి వినిపించండి. ఇవన్నీ నా భార్య ద్వారా నాకు చాలా కాలంగా తీరని కోరికలు" చెప్పాడు పశుపతినాథ్ ఆనందంగా!



20-4-90 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక